

అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని గొల్లపల్లి, వెంగళాయిపేట, బతికెపల్లి, లింగాపూర్ గ్రామాల్లో పదోన్నతి పొందిన అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా పదోన్నతి పొందిన అంగన్‌వాడీ టీచర్లు చిన్న పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి తగు సేవలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బోనగిరి నరేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డీఎంహెచ్‌వోగా ప్రమోద్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎంహెచ్‌వో

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ప్రమోద్ సోమవారం నియమాకం అయ్యారు. పెద్దపల్లి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న ప్రమోద్‌ను జగిత్యాల డీఎంహెచ్‌వోగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ సమీయోద్దిన్ ఈమేరకు ప్రమోద్ కలిసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రమోద్‌ను పలువురు అభినందించారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు, అయోధ్య గ్రామాల్లో సోమవారం విద్యుత్ అధికారులు రైతుల కోసం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ ఏఈ నవీన్ రైతులకు విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను వివరించారు.

అలాగే విద్యుత్ పరికరాలను సురక్షితంగా వినియో గించడం, ప్రమాదాలను నివారించడం, విద్యుత్ క్షేత్రాల్లో నిర్లక్ష్యం వల్ల ఏర్పడే ప్రమాదాలను నివారించేం దుకు తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్ లైన్‌మన్, అసిస్టెంట్ లైన్‌మన్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుల కన్నీటి గాథ

- ఏళ్ల తరబడి పట్టించుకోని ప్రభుత్వాలు
- పండించిన పంట అమ్ముకోవడానికి అవస్థలు
- రుణాలకు వడ్డీ వ్యాపారులే దిక్కు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..?

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సొంత భూమి లేని కౌలుపైన ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న కౌలు రైతుల గుర్తింపు ప్రశ్నార్థకంగా మారింది. పంట పెట్టుబడి కోసం ప్రభుత్వ సాయం అందక, పండించిన పంటను అధికారికంగా అమ్ము కోలేక కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూయజమానులైన రైతులకు సాగుకోసం ప్రభుత్వం అందించే రైతు బంధు ముందుగానే చేతికి అందేది. కానీ అదే పొలం సాగు చేసే కౌలు రైతుకు ప్రభుత్వ సాయం అందకపోగా, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి కౌలు కూలీ చెల్లించి సాగు చేసే పరిస్థితి నెలకొంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కౌలు రైతులకు సాయం అందిస్తామని హామీ ఇవ్వడం, ఆరు గ్యారంటీలలో రైతు భరోసాకింద కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని పేర్కొనడంతో కౌలు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

పెరిగిన పెట్టుబడుల భారం

రోజురోజుకూ పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఎకరం పొలం సాగు చేయాలంటే సుమారు 30వేల రూపాయల ఖర్చు అవుతుంది. మొక్కజొన్నకు రూ.25 వేల ఖర్చు, పసుపు, ఇతర పంటలకు

(తరువాయి 8వ పేజీలో)

జిల్లాలో సుమారు 25వేల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర త్రా రంగాలకు చెందిన కొందరికి వ్యవసాయం చేసే ప రిస్థితి, ఆసక్తి లేకపోవడంతో తమ భూములను కౌలుకు ఇస్తూ వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు విడతలుగా అందిస్తున్న రైతు బంధు పంట సాయం పట్టాదారు ఖాతాల్లోనే జమ అవుతూ వచ్చింది. కౌలు రైతు పేరు ఎక్కడా లేకపోవడంతో ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం భూ యజమానులకే చేరింది. దీంతో కౌలు రైతు దుస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడం, బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకొని, సాగు చేసుకోవడంతో అప్పులపాలవుతున్నారు.

జిల్లాలో 25 వేల మంది కౌలు రైతులు



కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తేమ వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు వేగవంతంగా కొనుగోళ్లు చేయాలని అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట, రూరల్ మండలంలోని తాటిపల్లి, మోరపల్లి, చల్‌గల్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కుప్పలు తేమ వచ్చిన వెంటనే తూకంవేసి రైస్‌మిల్లర్లకు తరలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డీఆర్‌డీవో రఘువరన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం గంగాధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని కలెక్టరు సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సారంగాపూర్ మండలంలో పర్యటించారు. పెంబట్ల, రంగపేట గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే సరళిని సరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు సుధన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రఘువరణ్, తహసీల్దార్ జహీర్, ఎంపీడీవో చౌడారపు గంగాధర్, సాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొడిమ్యాల-కొండాపూర్ గ్రామాల మధ్య ఉన్న మైసమ్మ చెరువులో మూడు రకాల చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల అభివృద్ధికి చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే వెంట మత్స్యకార సంఘం నాయకులు, ఫిషరీస్ ఏడీ విజయభారతి, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్ ఉన్నారు.

● కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కోరారు. సోమవారం మండలంలోని నమిళికొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపా ధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఉన్నారు.

'ఆరోగ్య శ్రీ'ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రపంచలో ఎక్కడా లేని విదంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. రాయికల్ మండలంలో 102 మందికి రూ. 48,21,550 విలువ గల చెక్కులు, సారంగపూర్, బీర్‌పూర్ మండలాలకు చెందిన 104 మందికి రూ. 57,18,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

స్వయంగా వివరాల నమోదు

8



సర్వేను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

ప్రకృతి అందాల మధ్య.. సోమేశ్వర గుట్ట

నిత్యం వేల సంఖ్యలో భక్తుల రాక..

ఘాట్ రోడ్డు సౌకర్యం లేక భక్తుల ఇక్కట్లు

6



సర్వేలో పాల్గొనని అధికారులపై కఠిన చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఎవరైనా అధికారులు గాని టీచర్లు, సూ పర్ వైజర్లు,ఎన్యూమరేటర్లు సర్వేలో పాల్గొనకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం జిల్లా స్థాయి అధికారులతో సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మండలాల వారిగా కుటుంబ సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు 15 నుంచి 20 ప్రశ్న పత్రాలలో వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సెలవు రోజుల్లో కూడా ఎన్యూ మరేటర్లు, టీచర్లు ఖచ్చితంగా సర్వేలో పాల్గొని వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, మధుసూదన్, దివాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ చిరంజీవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొడిమ్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాకర్‌ను సోమవారం రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు మేరకు సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్ర

- హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు
- జగిత్యాలలో బీఆర్‌ఎస్ రోడ్ షో

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈనెల 12వ తేదీన మంగళవారం కోరుట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరుట్ల పట్టణం నుంచి జగిత్యాల జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర జరుపనున్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పాదయాత్రలో భాగస్వామ్యం కానున్నారు.

జగిత్యాలలో రోడ్డు షో...

జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండు వద్ద బీఆర్‌ఎస్ రోడ్ షో నిర్వ హించనుంది. సాయంత్రం 5 గంటలకు జరిగే రోడ్ షోలో నాయకులు కేటీ ఆర్, హరీశ్ రావు, ఇతరులు ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, వేములవాడ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నృసింహారావు హాజరై ప్రసంగించనున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వరకు వెళ్లి కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతిపత్రం అందించడానికి అనుగుణంగా బీఆర్‌ఎస్ షెడ్యూల్ ప్రకటించింది.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా...



డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే కోరుట్ల

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రంలోనే మొట్టమొదటి పాదయాత్రను నిర్వహించ డానికి సంకల్పించాను. పదకొండు నెలల కాలంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పారిపాలనను పాదయాత్రలో ఎండగ డుతాము. పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతున్నాను.

ఎమ్మెల్యే పాదయాత్రకు సర్వం సిద్ధం

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కారానికి కోరుట్ల ఎమ్మెలే డాక్టర్ సంజయ్ చేస్తున్న పాదయాత్రకు బీఆర్‌ఎస్ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయం నుంచి ఉదయం 8 గంటల సమయంలో పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో పాదయాత్ర ప్రారంభమై జగిత్యాల మండలంలోని తాటిపల్లి గ్రామానికి మధ్యాహ్నం చేరుకుంటుంది. అక్కడి నుంచి తాటిపల్లి మీదుగా చల్‌గల్‌కు చేరుకుంటుంది. చల్‌గల్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పాదయాత్రలో పాల్గొంటారు. సాయత్రం 4 గంటలకు కలెక్టర్ ను వినతి పత్రం అందిస్తారు.

పోలీసులు అంకితభావంతో పని చేయాలి

- డీఎస్పీ రఘు చందర్
- వెల్గటూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ పోలీసు అంకిత భావంతో పని చేయాలని డీఎస్పీ రఘుచందర్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, సీడీ ఫైల్‌లు, ఇతర రికార్డులు పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసుస్టేషన్ నిర్వహణ, పోలీస్ స్టేషన్లలో 5ఎస్ అమలు తీరు, ఫంక్షనల్ వర్టికల గురించి కోర్టు డ్యూటీ, రిసెప్షన్, పెట్రోల్ మొబైల్, టెక్ టీమ్‌ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నేరాల నియంత్రణకై పోలీస్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వం, పోలీస్ వారు చేస్తున్న సూచనలను పాటించాలని సూచించారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే సంఘటనలపై అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. నేర నియంత్రణలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రా మంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్ పరిధిలో జరిగే చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భూ సంబంధిత విషయాల్లో జోక్యం చేసుకోవద్దని ఆదేశిస్తూ కోర్టుల ద్వారా సమస్యలని పరిష్కారం చేసుకునే విధంగా ప్రజలకి సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన వీరగోని అనిల్ అనే వ్యక్తి తన భార్యపై చేయి చేసుకోగా ఆ విషయాన్ని బాధితురాలు తన తల్లితండ్రులకు చెప్పుకుంది. బాధితురాలి తండ్రి, సోదరులు కాట్నపల్లి చేరుకుని ఈ విషయమై అనిల్‌ను ప్రశ్నించగా అనిల్ తన మామ, బావమరిదిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుల పిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సోమవారం అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పట్టుకున్నామని ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మట్టి తరిస్తున్న టిప్పర్ పట్టుబడిందని, కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రాంతం నుంచి మట్టిని కాట్నపల్లి వైపు మట్టిని తరలిస్తున్నారన్నారు. టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించామని ఎస్ తెలిపారు.

జ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఓదెల నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎలువాక శారద (35) సోమవారం జ్వరంతో మృతి చెందింది. పిట్టల ఎల్లయ్యపల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించే శారదకు పది రోజుల క్రితం తీవ్రజ్వరం రావడంతో కరీంనగర్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

కారు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం మొలంగూర్ బీసీ కాలనీలో బైక్‌ను కారు ఢీ కొన్న ఘటనలో చింతలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన మునిగంటి అయిలయ్య బైక్‌పై వెళుతుండా మొలంగూర్ బీసీ కాలనీ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో అయిలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ధర్మపురిలో చోరీ

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ రోడ్ సమీపంలో ఎలిగేటి లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. అనంతరం ఇంటిలో గల ఆరుతులాల బంగారు ఆభరణాలు, రూ 20వేలు నగదు అపహరిం చారు. జగిత్యాల నుంచి చేరుకున్న క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిం చారు. బాధితుడు లక్ష్మణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చుట్టూ పచ్చని చెట్లు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం. ఎత్తైన కొండ మీద సోమేశ్వర దేవాలయం. ఇవన్నీ భక్తులను కట్టిపడేస్తున్నాయి. చుట్టు పక్కల ప్రాంతాలే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా స్వామి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. శ్రావణ, కార్తీక మాసాల్లో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. కానీ భక్తులకు కనీస సౌకర్యాలు మాత్రం కరువు అనే చెప్పాలి. స్వామి వారు ఎత్తైన గుట్టపైన ఉండడంతో భక్తులు ఎక్కేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడుతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అది అమల్లోకి మాత్రం రావడం లేదు. దీంతో భక్తుల కాష్టాలు అలానే కొనసాగుతున్నాయి.



మల్లాపూర్ సోమేశ్వరకొండ ఆలయంలో భక్తులు(ఫైల్)

ప్రకృతి అందాల మధ్య.. సోమేశ్వర గుట్ట

- నిత్యం వేల సంఖ్యలో భక్తుల రాక..
- ఘాట్ రోడ్డు సౌకర్యం లేక భక్తుల ఇక్కట్లు



మల్లాపూర్ సోమేశ్వరకొండపైకి మెట్ల గుండా వెళ్లుతున్న భక్తులు

మల్లాపూర్, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండమీద ప్రకృతి అందాల మధ్య ఉన్న కనక సోమేశ్వర స్వామి భక్తులను ఆకట్టుకున్నాడు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా,పురాతన పుణ్యక్షేత్రంగా కొండపై ఆలయ నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా శివరాత్రి, కార్తీక, శ్రవాణ మాసాల్లో సమయంలో దేవాలయంలో ఘనంగా జరిగే ఉత్సవాలకు పలు జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తలు వస్తుంటారు. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన కొండపైకి చేరుకుంటారు. ముఖ్యంగా కార్తీక మాసంలో ఎక్కువగా శివుడికి దీపాలు వెలిగించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు భక్తులు. అయితే ఇంత మంది భక్తులు వస్తున్నా వారికి కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. కొండపైన ఉన్న స్వామి వద్దకు వేళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం గమనార్హం. మట్టి రోడ్డు గుండా భక్తులు కొండ పైకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా వేయిస్తామని చెప్పి స్వామి వారిని దర్శించుకుంటారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడమే కానీ గెలిచిన తరువాత ఇచ్చిన హామీలు మాత్రం నెరవేర్చడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అధికారులు రోడ్డు నిర్మాణం కోసం అంచనా అంటూ తూతూ మంత్రంగా పరిశీలన చేస్తుంటారే గానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు.

నిధులు మంజూరైనా..

అసెంబ్లీ ఎన్నికల ముందుకు టీటీడీ డైరెక్టర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆలయ అభివృద్ధి పనుల కోసం పది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరై సంవత్సరం గడుస్తున్నా ఘాట్ రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. నిధులు మంజూరు కావడం ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనుల ప్రారంభోత్సవానికి వేసిన శిలాఫలకం వరకే ఆగిపోయింది. ఆ తరువాత కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ఇకదాని ఊసే లేకుండా పోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు దృష్టి సారించి ఆలయ ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



స్వామి దర్శనం కోసం కొండపైకి వస్తుంటాము. ముఖ్యంగా శ్రావణ, కార్తీక మాసంలో బ్రహ్మ మూర్తంలో స్వామి వారిని దర్శించుకుంటాము. కుటుంబ సభ్యులంతా కలిసి వస్తాము. కానీ ఇంతగా భక్తులు వస్తున్నా సౌకర్యాలు మాత్రం అందుకు తగ్గట్టుగా లేవు. కొంగపైకి ఎక్కేందుకు భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వయసు పైబడిన వారు కొండపైకి ఎక్కలేకపోతున్నారు. ఇబ్బందులు లేకుండా రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- ర్యాగేళ్ల మనీషా, మొగిలిపేట భక్తురాలు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆలయానికి ఘాటు రోడ్డు నిర్మాణం. చేపట్టాలి. కోరిన కోరికలు తీర్చే అతి పురాతన ఆలయంగా ఏళ్ల క్రితం వెలిసినప్పటి స్వామి వారి దర్శనం కోసం ఇతర జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- శివ శ్రీనివాస్, మల్లాపూర్ భక్తుడు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం

- వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేటీఆర్ కాంగ్రెస్ బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారని, అసలు బీసీల గురించి మాట్లాడే అర్హత ఉందా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేటీఆర్ బీసీల గురించి మాట్లాడాలంటే ఆ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి, ప్రతిపక్ష పదవులను బీసీ, ఎస్సీలకు ఇవ్వాలన్నారు. ఒక్కటి ఇచ్చినా మాట్లాడే అర్హత ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని, కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. ఆ వివరాల కోసం విచారణ చేయిస్తామని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న ఈ కుల సర్వే దేశ వ్యాప్తంగా జరగాలని డిమాండ్ వస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ సర్వేను అక్కడక్కడ అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతీ తెలంగాణ పౌరుడు సహకరించాలన్నారు. సర్వే ఇబ్బంది పెట్టేందుకు, బలహీన వర్గాలకు మాత్రమే పరిమితమైంది కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక దిక్సూచి అవసరాల కోసం తీసుకుంటున్న సమాచారమని స్పష్టం చేశారు. ఎన్యూమరేటర్లకు సహకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వాఖ్యలకు ప్రభావితం కావద్దని కోరారు. అంతకుముందు రాజన్న ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ పూలమొక్కతో స్వాగతం పలికారు. కాగా పోలీసులు ఏర్పాటు చేసిన గౌరవవందనాన్ని స్వీకరించారు. సోమవారం తెల్లవారు జామున రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గంభీరావుపేటలో గంగపుత్రుల రాస్తారోకో



గంభీరావుపేటలో రాస్తారోకో చేస్తున్న గంగపుత్రులు

గంభీరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద సోమవారం రాత్రి గంగపుత్రులు రాస్తారోకో చేపట్టారు. చేప పిల్లలు పంపిణీ చేస్తామని మత్స్యశాఖ అధికారులు లింగన్నపేట సెంటర్‌కు రమ్మని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. గతంలో ఈ సమయానికి మానేరులో, చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేశామని, ఈ ఏడు చేప పిల్లలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. లింగన్నపేట సెంటర్ వద్ద పొద్దంతా తిండి తిప్పలు లేక ఉంటే, చేప పిల్లలు ఇవ్వకుండా తిరిగి పొమ్మనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గంటల తరబడి ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో పోలీస్‌లు అక్కడకి చేరుకుని గంగపుత్రులను సముదాయించారు.

మాజీ సర్పంచుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రికత్తకు దారి తీసింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా నెల రోజులు రిలే దీక్షలు, ఆందోళనలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మాజీ సర్పంచులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. 2019 నుంచి 2024 వరకు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మాజీ సర్పంచులు

రగుడు జంక్షన్ నుంచి ర్యాలీగా తరలి రావడంతో కలెక్టరేట్ ఎదుట పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్‌ను కలుస్తా మంటూ దూసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. వినిపించుకోకుండా కలెక్టరేట్‌లోకి పరుగు తీయడంతో పోలీసులు గేట్‌లను మూసివేశారు. ఆగ్రహించిన మాజీ సర్పంచ్‌లు అక్కడే బైఠాయించారు. డీఎస్పీ చంద్ర శేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతుండగానే కొందరు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లను పోలీసు వాహనాలల్లో కలెక్టరేట్‌లోకి తీసుకురాగా వారు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అంజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పం చులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతు వేదికలు, శశ్మాన వాటికలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్‌భగిరథ పనులు, సీసీరోడ్లు, మురికికాలువలతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాలేదని, వాటికోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షులు గణప శివజ్యోతి, చాకలి రమేష్, బొజ్జం మల్లేశం, కోల నర్సయ్య, వంశీకృష్ణరావు, గున్నాల లక్ష్మణ్, చల్లనారాయణ, బూర్గుల నందయ్య, పొన్నాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

- కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనలు చేస్తుండడంతో పోలీసులు గేట్లను మూసివేశారు. కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా అధికారులతో పాటు ప్రజలను అనుమతించకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన అనంతరం జిల్లా అధికారుల ఐడీ కార్డులను చూసి పంపించారు. దీంతో అధికారులతోపాటు ప్రజలు గంటల తరబడి నిరీక్షించారు.

క్రైం కార్నర్

తండ్రి కడసారి చూపు కోసం..

- ఐదు రోజులుగా ఫ్రీజర్‌లోనే కూతురు మృతదేహం
- బెయిల్ ఇవ్వని కోర్టు

సారంగాపూర్, నవంబరు. 11 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లా రేచిపల్లి గ్రామానికి చెందిన పోగుల రాజేశం మల్లీశ్వరి కూతురు లత అనుమానాస్పద స్థితిలో నిర్మల్ జిల్లా, దస్తూరాబాద్ మండలం, రేగోజీపేట గ్రామంలో ఐదు రోజుల క్రితం మృతి చెందగా ఆమె మృతదేహం తండ్రి కడసారి చూపు కోసం ఫ్రీజర్‌లోనే ఉంచారు. లత గత శుక్రవారం అత్తింట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. లత తండ్రి రాజేశం 9నెలలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మావోయిస్టులకు సహకరిస్తున్నాడనే అనుమానంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. రాజేశం విడుదల కోసం పౌరహక్కుల నేతలు మాదన కుమారస్వామి, సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి అక్కడి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా ఎన్ఐఏ కోర్టు బెయిల్ మంజూరు చేయక పోవడంతో భార్య మల్లీశ్వరి పుట్టెడు దుఖంతో తిరుగు ప్రయాణం అయ్యారు. మంగళవారం లత అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వీర్నపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో బాధపడుతున్న గిరి జనుడు వ్యవసాయ మోటారు వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామపరిధి కేలోత్ తండాలో ఆదివారం అర్ధ రాత్రి చోటు చేసుకున్న సంఘటన వివ రాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అజ్మీరా రెడ్డి (57) ఆదివారం రాత్రి తన సోదరుడి పొలం వద్ద ఉన్న స్టార్టర్ ఆఫ్ చేయడానికి వెళ్లాడు. స్టార్టర్ ఆఫ్ చేస్తుండగా అక్కడ పైకి తేలి ఉన్న సోలార్ విద్యుత్ తీగలకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికు లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆసు పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అజ్మీరారెడ్డి మానసిక స్థితి సరిగా లేక సోదరుడు రమేష్‌తో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో చెలరేగిన మంటలు



మంటలు చల్లార్చుతున్న అగ్నిమాపక సిబ్బంది

జమ్మికుంట రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల మురుగన్ ఇండస్ట్రీస్ (జిన్నింగ్ మిల్లు)లో సోమవారం మంటలు చెలరేగాయి. జిన్నింగ్ చేస్తుండగా యంత్రంలో వచ్చిన చిన్న రాయి వల్ల నిప్పు రవ్వలు ఏర్పడి పత్తిపై పడి మంటలు వ్యాపించాయి. గమనించిన మిల్లు నిర్వాహకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మిల్లులో పని చేస్తున్న కార్మికులు నీళ్ల చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం మంటలను అదుపులోకి తీసుకు వచ్చింది. ఎనిమిది లక్షల విలువ గల పత్తి కాలిపోయిందని మిల్లు యాజమాని బచ్చు భాస్కర్ తెలిపారు.

కార్గిల్ లేక్‌లో దూకి కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన పల్లె ఆంజనేయులు (50) అనే భవన నిర్మాణ కార్మికుడి కార్గిల్ లేక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 9న ఇంట్లో నుంచి వెళ్లిన ఆంజనేయులు సోమవారం కార్గిల్‌లేక్‌లో శవమై తేలాడు. నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కార్గిల్ లేక్ గట్టు వద్ద మృతుడికి సంబంధిచిన టిఫిన్ బాక్స్ మృతుడి జేబులో ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందిన చీటీ ఆధారంగా ఆంజనేయులుగా గుర్తించారు. ఆంజనేయులు వేములవాడలో భవన నిర్మాణ రంగంలో ఇసుక మోసే పని చేస్తాడు. అతడి భార్య 20 నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి సంతానం లేదు. ఒంటరి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడని ఆంజనేయులు సోదరుడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

పొలాల్లో అగ్నిప్రమాదం



కాలిపోయిన వరి పొలం

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజాపూర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పంటించడంతో మంటలు కొయ్యని పొలాల్లోకి వ్యాపించి పంట కాలిపోయింది. బాధిత రైతు చింతిరెడ్డి మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఆ మంటలు సమీపంలో ఉన్న కోతకు వచ్చిన మల్లారెడ్డి పదెకరాల పొలంలోకి వ్యాపించి కొంత వరి పైరు దగ్ధమయింది. మల్లారెడ్డి సమాచారం తెలుసుకుని అప్రమత్తమై మంటలు ఆర్పివేశాడు. దీంతో కొంతమేర నష్టం వాటిల్లింది. వరి కొయ్యలకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత మల్లారెడ్డి కోరారు.

తండ్రిని హత్య చేసిన తనయుడి అరెస్టు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడు తొట్ల తిరుపతి యాదవ్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు అతన్ని రిమాండ్ చేయగా కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన తొట్ల మధునయ్య(71) మధురమ్మ దంపతులకు ఒక కొడుకు తిరుపతితో పాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. సింగరేణి కార్మికుడిగా పని చేసిన మధురయ్య 13 సంవత్సరాల క్రితం పదవీవిరమణ పొందారు. మధునయ్య పేరిట ఉన్న ఐదెకరాల పదమూడు గుంటల భూమిలో కొడుకు తిరుపతి, కోడలు పేరిట తలా రెండెకరాల భూమిని వారికి రిజిష్ట్రేషన్ చేయించాడు. మిగిలిన ఒక ఎకరం పదమూడు గుంటల భూమితో పాటు మొత్తం భూమిని కొడుకు కోడలు సాగు చేసుకుంటున్నారు. అయితే మధనయ్య వద్ద ఉన్న పదమూడు గుంటల భూమిని తన కూతుళ్లకు ఇద్దామని మధునయ్య మధురమ్మ దంపతులు నిర్ణయించి ఈ విషయాన్ని తన కొడుకు తిరుపతికి చెప్పారు. దానికి తిరుపతి ఒప్పుకోలేదు. ఈ విషయంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా గొడవ కాగా తిరుపతి తన తండ్రి మధునయ్యను కొట్టి చంపాడని ఎస్ఐ వివరించారు. మృతుడు మధునయ్య భార్య ఫిర్యాదు మేరకు తిరుపతి యాదవ్‌పై హత్య కేసు నమోదు చేసి అతడిని సోమవారం అరెస్టు చేశామన్నారు. కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించడంతో అతన్ని జైలుకు తరలించామని తెలిపారు.

కన్నవారిని విస్మరిస్తే శిక్షార్హులే..

● వృద్ధులకు అండగా పలు చట్టాలు

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం జీవితాన్ని ధారపోశారు. సమాజం కోసం సర్వశక్తులు ఒడ్డారు. జీవిత చరమాంకంలో ఎన్నో ఛీత్కారాలు కష్టనష్టాలు అనుభవిస్తున్నారు. వృద్ధులు వారికి ఉండే హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన లేకపోవడంతో పలువురు తమ సమస్యల పరిష్కారం కోసం ఠాణామెట్లు ఎక్కుతున్నారు. వృద్ధులకు ప్రభుత్వం, పోలీసులు అందిస్తున్న చట్టాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేకకథనం.. తల్లిదండ్రుల పోషణను విస్మరిస్తే వారిని శిక్షించేందుకు చట్టాలు ఉన్నాయి. వృద్ధులను పట్టించుకోకుంటే వారికి చట్టం అండగా ఉంటుంది. చట్టం పరిధిలో వారికున్న హక్కులు ఏంటో తెలుసుకుందాం..



● వేధింపుల నుంచి రక్షణ కోసం జాతీయ వయోశ్రీ యోజన..

వృద్ధుల్లో 50 శాతానికి పైగా వేధింపులకు గురవుతున్నట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం వృద్ధుల కోసం పలు చట్టాలు రూపొందించింది. కుమారులు, కోడళ్ల ఇతర బంధువుల దూషణలు, చిత్రహింసలతో ఇబ్బంది పడేవారి కోసం జాతీయ వయోశ్రీ యోజన పేరిట పథకాన్ని ప్రవేశపెట్టింది. వృద్ధుల్లో అధికశాతం వైకల్యాలు ఇతర వ్యాధులతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారే ఉన్నారు. మలిదశలో ఆసరాగా నిలవాల్సిన పిల్లలు కన్నవారిని ఆశ్రమాలు, ఇతర చోట్లలో చేరుస్తున్న ఘటనలు కోకొల్లలు. దీంతో వృద్ధులకు ఒంటరితనం శాపంగా మారింది. సామాజిక భద్రత పథకాలు వారికి ఉపయోగపడటం లేదు. అందుకే మన దేశంలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ కోసం 2007లో కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, పెద్దల పోషణ కోసం సంక్షేమ చట్టం తెచ్చినా దీనిని అమలు చేయడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉంది.

● సీనియర్ సిటిజన్ మెయింటనెన్స్ చట్టం

ఇది 2007లో అమలైంది. ఈచట్టం ప్రకారం వయోవృద్ధుల రక్షణతోపాటు నెలసరి జీవన భృతి అందిస్తారు.. దీనికి ఆర్డీవో మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తారు. బాధితులు ఆర్డీవోకు ఫిర్యాదు చేసుకుంటే వారి కుమారులవద్ద నుంచి జీవనభృతి కల్పించే అవకాశం ఉంది. అడప్షన్ మెయింటనెన్స్ చట్టం 1956లో అమల్లోకి తెచ్చారు. ఈ చట్టం ప్రకారం సెక్షన్30 కింద కుమారులు, కూతుళ్లకు సైతం వర్తిస్తుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టం కింద 1973 సెక్షన్ 125 సీఆర్‌పీసీ ప్రకారం కోర్టులో కేసు వేసుకునే అవకాశం ఉంది. బాధితుల కుమారులు, కూతుళ్ల ఆర్థిక స్థోమత బట్టి వారినుంచి జీవనభృతి కల్పించే విధంగా చట్టాలు చెబుతున్నాయి. డెయోస్టిక్ వాలంటిన్స్ చట్టం ప్రకారం సైతం వృద్ధులకు కోర్టులో కేసు వేసుకునే వీలుంది.

● ప్రభుత్వ నుంచి ఇచ్చే రక్షణలు

1999 జనవరి 13 జాతీయ వృద్ధుల పాలసీని ప్రభుత్వం ఆమోదించింది. సంక్షేమ చర్యలను వేగవంతం చేయడానికి వృద్ధులకు ప్రయోజనం కలిగించడంలో సాధికారికత కల్పించడానికి ఏర్పాటు చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి భద్రత కల్పించడానికి పెన్షన్ ఫండ్ ఏర్పాటు, వృద్ధుల కోం వసతి గృహాలు, సంరక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తోంది. సెక్షన్ 88-బి-88 డి, 88-డి, డిబి ఆదాయ పన్ను చట్టం ప్రకారం వృద్ధులకు పన్ను తగ్గింపు ఉంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వృద్ధుల ప్రయోజనం కోసం అనేక పథకాలు అందిస్తోంది. జీవనధార యోజన, జీవన్ అక్షయ్ యోజన, సీనియర్ సిటిజన్ యూనిట్ యోజనా, మెడికల్ ఇన్సూరెన్స్ అందిస్తోంది.



ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఉషు పోటీలకు స్పందన

● 150 మంది క్రీడాకారుల హాజరు



ఉషు పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 11: జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఉషు పోటీలకు విశేషస్పందన లభించింది. ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్‌లోని రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉషు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపు సుశాంక్‌రెడ్డి, బార విద్యా సాగర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉషు క్రీడతో విద్యా ర్థులలో శారీరక పటుత్వం పెరుగుతుందన్నారు. క్రీడలతో వివిధ ప్రాంతాల విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ఫండస్ పాఠశాల యాజమాన్యం అందించిన బహుమతులను జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమి వ్యవస్థాపకులు వికాస్, ఉషు కోచ్ విక్రమ్ గాంధీ, మహేష్, ముఫాజిల్, అఖిల పాల్గొన్నారు.

'మైటా' ఉత్సవాలకు మంత్రి శ్రీధర్‌బాబు



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మలేసియా తెలంగాణ తెలుగు అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో మలేసియాలోని కౌలలాంపూర్‌లో మూడురోజుల పాటు జరిగిన మైటా దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, త్రిపుర రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ హాజరయ్యారు. కరీంనగర్ జిల్లాకు చెందిన రెండు తెలుగు రాష్ట్రాల అల్గి ప్రతినిధి ఉప్పుల అంజనీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. మైటా అధ్యక్షుడు సైదా తిరుపతి, ఆర్గనైజర్ శివంగుల రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళా ప్రదర్శనలు నిర్వహించారని అంజనీప్రసాద్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించి గురుకులాల ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మానకొండూర్ మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో సోమవారం జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, ప్రభుత్వానికి పేరు తీసురావాలని సూచించారు. జోన్ లెవల్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన తెలిపారు. అంతకు ముందు జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి అనంతలక్ష్మి, తహసీల్దార్ బి రాజేశ్వరి, ఎంఈవో మధుసూదనాచారి, ప్రిన్సిపాల్స్ గోలి జగన్నాథం, లచ్చయ్య, అశోక్‌బాబు, జి అశోక్‌రెడ్డి, వాసు, ఇసాక్, శివప్రసాద్, శేఖర్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు చెందిన 1,190 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక



పార్థు

కోల్‌సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామ గుండం పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ కుమా రుడు టి పార్థుశ్రీకృష్ణ జాతీయస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. తేజస్ డిఫెన్స్ అకా డమీ కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ గేమ్స్‌లో అర్చరీ అండర్-19 కాంపౌండ్ బోలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. నవంబరు 14 నుంచి 16 వరకు గుజరాత్‌లోని నడియాడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పార్థు ఎంపికయ్యాడు. తన కుమారుడు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఉత్తమ ప్రదర్శన చేసి దేశం తరఫున కూడా ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటు న్నట్టు ప్రవీణ్‌కుమార్, కోచ్ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్‌యూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కిషోర్



ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవి ద్యాలయం పరిపాలన విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా వైకిషోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన శాతవాహన ఫార్మసీ కళాశాలలో విధులు నిర్వహించారు. విధుల్లో చేరిన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు పలువురు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అసమానతలకు వ్యతిరేకంగా రంగవల్లి పోరాటం



అభివాదం చేస్తున్న విమలక్క, ప్రొఫెసర్ కాసీం తదితరులు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప మహిళరంగవల్లి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రంగవల్లి వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రంగవల్లి విజ్ఞాన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటు చేశారన్నారు. ఆదివాసీ బిడ్డలకు అండగా నిలిచారని గుర్తు చేశారు.

ప్రజల పక్షాన పోరాడిన వీర వనిత రంగవల్లి

గొప్ప కుటుంబంలో పుట్టి ప్రజల పక్షాన పోరాటం చేసిన వీర వనిత రంగవల్లి అని ఉస్మానియ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం అన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడిన ప్రతీ ఒక్కరు అమరత్వం పొందారన్నారు. సాయుధ పోరాటంలో ఉద్యమించిన రంగవల్లిని ఎన్‌కౌంటర్ చేయడం హేయమైన చర్యన్నారు. పోలీసులు పట్టుకున్న తరువాత కోర్టు ఎదుట ఉంచి వారు చేసిన నేరాన్ని విచారించాలని, కానీ ఇద్దరు పురుషులను, మహిళలను ఎన్‌కౌంటర్ చేసి రాజకీయ వాతావరణాన్ని సృష్టించారని గుర్తు చేశారు.

రంగవల్లి నేటి తరానికి స్ఫూర్తిదాయకం

భూస్వామ్య, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన విప్లవ కెరటం రంగవల్లి అని, ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా ఆమె మాట్లాడారు. నందికమాన్ చౌరస్తాలో అమరుల జ్ఞాపకార్థం స్థూపాన్ని నిర్మించాలని అనుకున్నామని, కొన్ని కారణలతో జరగలేదని అన్నారు. సమాజానికి జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతోనే విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, స్థానిక కౌన్సిలర్ కళ్యాణి, ప్రముఖ న్యాయవాది భగవంతరెడ్డి ఉన్నారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

● సుమారు 80 వేల మంది భక్తుల రాక



భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయం కిటకిటలాడింది. ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించిన భక్తులు అనంతరం పార్వతీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు క్యూలైన్‌లోని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు ఐదుగంటల సమయం పట్టింది. సోమవారం సుమారు 80 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్తీక సందడి

ధర్మపురి, కోటిలింగాలలో గోదావరి హారతి

వేములవాడ, కొండగట్టులో ప్రత్యేక పూజలు, దీపోత్సవం



రాజన్న ఆలయంలో సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రెండవ సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహ స్వామి, అను బంధ శ్రీ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శేషప్ప కళా వేదికపై శృంగేరి ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపెల్లి సంతోష్‌శర్మ కార్తీక మాసం గురించి సోమవారం పురాణ ప్రవచనం చేశారు.

పదో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మ పురి వద్ద గోదావరి హారతి పదో రోజు సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, బొజ్జ రమేష్‌శర్మ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ అర్చకులు తెలిపారు. అర్చకులు నాగ రాజు శర్మ, సంజీవ్ శర్మ భక్తులు పాల్గొన్నారు. సోమవారం సందర్భంగా శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు.

వేములవాడలో సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఆలయంలోని కళావేదిక ప్రాంగణంలో సోమవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలను వెలిగించారు. ధర్మపురికి చెందిన నరహరి శాస్త్రీయ సంగీతం భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు రాజేశ్వర శర్మ, దుమాల నాగరాజు శర్మ, వెంకటయ్య, ఏఈవో జయకుమారి, సూపరింటెండెంట్ పూజిత, తిరుపతిరావు, పీఆర్వో అశోక్ తదితరులు ఉన్నారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివారం దేవతలకు అర్చనలు చేపట్టారు. రాత్రి ఆలయ అద్దాల మండపం వద్ద లింగాకరంలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు.

కొండగట్టులో కార్తీక దీపోత్సవం

మల్యాల, (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తికదీపోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో కలిసి ఆగమ పాఠశాల విద్యార్థులు కార్తిక దీపాలు వెలిగించారు. పర్యవేక్షకులు చంద్రశేఖర్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.









ధర్మపురిలో భక్తుల పవిత్ర స్నానాలు, గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు, కోటిలింగాల, కొండగట్టులో పూజలు, వేములవాడలో మహాలింగార్చన

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

● విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

బుగ్గారం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఈ మేరకు మండలంలోని వెలుగొండ యశ్వంతరావు పేట గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు సాఫీగా కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ జడ్పీటీసీ బాదినేని రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, వెలుగొండ మాజీ సర్పంచ్ తిరుపతి, తహసీల్దార్ మాజిద్ పాల్గొన్నారు.

విద్యార్థులు శిక్షణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి

డీఐఈవో వెంకటేశ్వర్లు

జగిత్యాలరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఐఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని హస్నాబాద్‌లో గల ఫిష్ ఫారంను జగిత్యాల ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాల, రాయికల్ జూనియర్ కళాశాల ఫిషరీస్ కోర్సులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సందర్శించి శిక్షణ పొందారు. ప్రిన్సిపల్ నాగభూషణం, లెక్చరర్లు మనోహర్‌రెడ్డి, గంగారెడ్డి, రాజశ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

పాదయాత్రను వ్యతిరేకిస్తూ వెలసిన ఫ్లెక్సీ

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మీరు పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో చెన్నమనేని శ్రీనివాస్‌రావు పేరిట ఫ్లెక్సీ వెలిసింది. మీ ప్రభుత్వ హయాంలో వరికల్లాల వద్ద తాలు తప్ప తేమ పేరుతో క్వింటాలుకు 10 కిలోల దోపిడీ చేసి వరి రైతులను గోస పెట్టినందుకా ? పాదయాత్ర అని.. కోరుట్ల నియోజకవర్గ ప్రజలు మిమ్ములను ప్రశ్నిస్తున్నారని..సమాధానం చెప్పి పాదయాత్ర చేయాలని ఫ్లెక్సీ వెలవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎలాంటి అవంత రాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీ, రవీంద్రనాథ్ ఠాగూర్ కాలనీల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆకస్మికంగా పరిశీలించారు. స్వయంగా ప్రశ్నపత్రాలలో వివరాలను నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటి గోడపై కచ్చితంగా స్టిక్కర్ అంటించాలన్నారు. సర్వే జరుగుతున్న సమయంలో కుటుంబ యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌డీవో మధుసూదన్, డీఆర్‌డీవో రఘువరన్ పాల్గొన్నారు.

రాయికల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం రాయికల్ మండలంలోని ఆలూరు గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్వయంగా సర్వే ప్రశ్నాపత్రాన్ని వివరాలను నమోదు చేశారు. సర్వే అయిన ప్రతి ఇంటి గోడపై ఖచ్చితంగా స్టిక్కర్ అంటించాలని తెలిపారు. పత్రంలో ఉన్న ప్రశ్నలను సరిగ్గా నింపుతున్నారా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఆర్‌డీవో రఘువరన్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలని సర్వే బృందంకు జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి సూచించారు. మండలంలోని మాదాపూర్, పైడిమడుగు గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. బృందాలు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి పలు కుటుంబాలలో వివరాలను స్వయంగా గౌతమ్ రెడ్డిని నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ కిషన్‌లతో పాటు సర్వే బృందాలు పాల్గొన్నాయి.

పెగడపల్లి : సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా సర్వే పూర్తి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి మనోహర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నందగిరిలో సోమవారం కుటుంబ సర్వేను ప్రత్యేకాధికారి మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వెల్గటూర్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ శేఖర్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కుటుంబ యజమానులు ఎన్యుమరేటర్లకు సరియైన సమాచారం అందించాలని కోరారు. మూడవ రోజు 1192 కుటుంబాల సర్వే నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు.



సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

వైభవంగా పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ

కొడిమ్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి అనుబంధ గ్రామమైన రామరావుపల్లి గ్రామంలో సోమవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులకు, కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. పోచమ్మ దేవతను చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ముత్యం శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, నాచుపల్లి గ్రామ మాజీ సర్పంచు లతతిర్మలేష్‌యాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, మల్లిఖార్జున్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

బీరప్ప గుడి నిర్మాణానికి భూమి పూజ:

మండలంలోని నమిళికొండ గ్రామంలో సోమవారం బీరప్ప గుడి నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే వెంట నమిళికొండ కుర్మ సంఘం నాయకులు, సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు శంకర్, నారాయణగౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

పెగడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆరవెల్లిలోని గ్రామీణ వైద్యశాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ఫార్మసీ, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు ప్రభుత్వాసు పత్రుల్లోనే మెరుగైన సేవలందుతున్నందున, ప్రభుత్వాసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. క్యాన్సర్, బీపీ, డయాబెటిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నరేష్, సీహెచ్‌వో మహేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది శోభారాణి, జయశీల, శ్రీకాంత్ రెడ్డి, రవికిరణ్, లావణ్య ఉన్నారు.

15న లక్ష్మీనరసింహస్వామి జాతర

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూషణరావు పేటలో ఈ నెల 15న కరికొండ లక్ష్మీనరసింహస్వామి జాతర నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కొండపై వెలిసిన స్వామివారిని దర్శించుకుని జాతరను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు అన్నదానం చేయనున్నామని తెలిపారు.

కౌలు రైతుల కన్నీటి గాథ..

(5వ పేజీ తరువాయి)

వేలల్లో సాగు ఖ ర్చులు అవుతున్నాయి. దీనికి తోడు కౌలు రేటు గతంలో ఏడాదికి రూ. 2నుంచి 3వేలు ఉండగా, అది రూ. 6వేలకు పెరిగి, ప్రస్తుతం భూమి నిబట్టి ఒక పంటకు సుమారు రూ. 14వేల వరకు అంటే రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.24నుంచి 28వేల కౌలు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. ఎరువుల ధరలు, కూలీల రేట్లు, యంత్రాల కిరాయిలు పెరగడంతో కౌలు రైతులకు కనీసం ఎకరాకు రూ.10నుంచి రూ.15వేల కూడా మిగిలే పరిస్థితి లేకుండా పోయిం ది.

పంట ఉత్పత్తులు అమ్మేందుకు తిప్పలే

కౌలు తీసుకున్న భూమిలో ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన కౌలు రైతులకు పంట అమ్ముకోవడానికి తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో ఏ రైతు ఎంత పంట సాగు చేశారు అనేది వివరాలు సేక రించి పంటసాగు వివరాలు, దిగుబడి అంచనాను ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. అధికారులు సైతం పట్టాపాసు పుస్తకం కలిగిన రైతుల వివరాలను మాత్రమే సర్వేలో నమోదు చేస్తూ ప్రభుత్వానికి నివేదిం చడం, భూ యజమానులు తాము కౌలుకు ఇచ్చిన రైతు పేరు నమోదు చేస్తే తమకెక్కడ రైతు బంధు రాదో అనే భయంతో భూ యజమానులు తమ భూములను తామే సాగు చేసుకుంటున్నట్లుగా పేర్లు నమోదు చేసుకుంటూ వస్తున్నారు. వివరాలన్నీ భూ యజమాని పేరున నమోదు అయ్యి ఉండడంతో కౌలు రైతులు పంట విక్రయించే సమయానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే, యజమానుల ఖాతాల్లోకి డబ్బులు చేరు తుండడం, అవి తీసుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

పంట నష్ట పరిహారం సైతం..

ప్రకృతి వైపరీత్యాల్లో, లేక కాలం కలిసి రాకపోవడం కారణంగా పంట నష్టపోతే దానికి లభించే పరిహారం సైతం యజమానికే చెందుతుందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అక్కడక్కడ తిరిగి నష్టపరిహారం అందిస్తున్నప్పటికీ, చాలా చోట్ల యజమానులు కౌలు రైతుల అమాయకత్వం, యజమానుల అజామాయిషీ ఆధారంగా కొంతమందికి నష్టపరిహారం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామన్న పంట బీమా పథకం సైతం యజమానుల పేరుమీదనే నమోదవడంతో వచ్చే పరిహారం సైతం వారి ఖాతాల్లోనే జమ అవుతుందని, పంటల సర్వే సైతం యజమానుల పే రుమీదనే జరిగిందని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుల, మత రాష్ట్ర సాధన లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కుల, మత రాష్ట్ర సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. భారత మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని మైనార్టీ వెల్ఫేర్ దినోత్సవ కార్యక్ర మంలో పాల్గొన్న ఆయన అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శనీయమని, కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, మైనార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అడువాల జ్యోతి, వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ బద్దం లత, కూసరి అనిల్, గుడ్ల జగదీష్, కమల్, పంబాల రాంకుమార్, ప్రభాత్ సింగ్ ఠాకూర్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి చక్రు నాయక్, సూపరింటెండెంట్ మహ్మద్ అలీ అఫ్సర్, ఆర్ఎల్‌సీ దాసరి రాజేందర్, కాంగ్రెస్ నాయ కుడు జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి గ్రామస్థుల సహకారం

స్వచ్ఛందంగా మార్కింగ్

భీమారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి కోసం మండలవాసులు నడుం బిగించారు. మారుమూల మండల కేంద్రమైన భీమారం మండల కేంద్రం మీదుగా వేసే డబుల్ రోడ్డు నిర్మాణానికి గ్రామస్థులు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సోమవారం గ్రామస్థులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వయంగా మార్కింగ్ చేసుకున్నారు. మార్కింగ్ విషయంలో కొందరు గ్రామస్థులు ముందుకు రాకపోవడంతో గ్రామస్థులు భవిష్యత్ అభివృద్ధి గురించి అవగాహన కల్పించి వారిని సముదాయించారు. డబుల్ రోడ్డు వేయడంతో మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని వివరిస్తున్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ పడాల తిరుపతి

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పడాల తిరుపతి అన్నారు.

రాయికల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా, మంచి లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముక్కువతో చదివి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని అన్నారు. ర్యాంక్‌లే ప్రామాణికం కాదని, నాణ్యమైన విద్య అవసరమని, జీవితకాలం ఉపయోగపడే విద్య అవసరమన్నారు. అనంతరం ప్రొఫెసర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో శ్రీపతి రాఘవులు, పొన్నం రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివానందం, గంగాధర్, శ్రీకాంత్, సత్య నారాయణ, మల్లేశం, నాగరాజు పాల్గొన్నారు.



ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

చలికాలంలో పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 11 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో అనేక వైరస్‌లతో గేదెలు, గొర్రెలు, మేకలు రోగాల భారిన పడకుండా పశుపోషకులు ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి మనీషాపటేల్ అన్నారు. పశు వైద్య, పసుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాల వల్ల పాల ఉత్పత్తి తగ్గడం, గర్భ స్రావం జరగవనే అపోహలు మాని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పాడి రైతుఉల గేదెలు, ఆవులు, ఎద్దులు, మూడు నెలలు పైబడిన దూడలకు టీకా తప్పకుండా వేయించి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది మురళి, రమణయ్య చిరంజన్, మోహన్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగొద్దు

కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్ రెడ్డి



కొనుగోలు కేంద్రాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

కోరుట్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండలంలోని వెంకటాపూర్, గుమ్లాపూర్, మోహన్‌రావుపేట గ్రామాలలో తహసీల్దార్ కిషన్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇప్పడి వరకు కొనుగోలు కేంద్రాలలో నిలువ ఉన్న ధాన్యం వివరాలతో పాటు కొనుగోలు చేసిన ధాన్యం నమోదు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు సలహాలను అందించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనగోలు చేయాలన్నారు. గ్రామాలలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేంధర్ రావులతో పాటు కొనుగోలు కేంద్రాల నిర్వహ కులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్ ఫోన్ అందించిన ఎస్ఐ

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చెందిన గజ్జెల చంద్రశేఖర్‌కు సోమవారం తాను పోగోటుకున్న సెల్ ఫోన్‌ను రికవరీ చేసి బాదితుడికి పోలీసులు అందించారు. గత నెల 5వ తేదీన కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో చంద్ర శేఖర్ సెల్ ఫోన్‌ను పోగొట్టుకోగా కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వార ఫోన్‌ను రికవరీ చేసి బాధిఇతుడు చంద్రశేఖర్‌కు కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ అందించారు.

సూర్యారావు కుటుంబ సభ్యులకు పరామర్శ

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్, జువ్వాడి సూర్యారావు కుటుంబ సభ్యులను జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు పరామర్శించారు. జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు డబ్బు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు పునుగోటి వేంకటేశ్వర్‌రావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెత్తపు లక్ష్మణ్, సీనియర్ న్యాయవాది గడ్డం లింగారెడ్డి, ధర్మపురి బార్ అసోసియేషన్ ట్రెజరరీ రమేష్, న్యాయవాది శ్రీనివాస్, కీర్తి, రాజారపు నాగేందర్ పాల్గొన్నారు .

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన పాలకుర్తి అశోక్ గల్ఫ్‌లో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులకు సోమవారం మస్కట్ గ్రూప్ సభ్యులు పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

సంజయ్ పాదయాత్ర ఎవరి కోసం..

● ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలు ఓర్వలేకనా ?

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ చేస్తున్న పాదయాత్ర ఎవరి కోసమని... ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక పాదయాత్ర చేస్తున్నాడా.. పాదయాత్ర ఎందుకు చేస్తున్నాడో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఎమ్మెల్యేను ప్రశ్నించాడు. సోమవారం పట్టణంలోని మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణ చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ కల్వకుంట్ల కుటుంబానిదేనని అన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ 100 రోజులలో తెరిపిస్తానని మాట ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అది మరిచి పోయాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే 18 వేల కోట్ల రుణమాఫీ చేశామని త్వరలో అర్హులైన రైతులకు రుణమాఫీ అందుతుందని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రైతులను తప్పుదోవ పట్టించడానికి పాదయాత్ర చేస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అన్వర్, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంబేరీ నాగభూషణం, జిందం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్ కుమార్, ప్రభాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంజయ్‌ది పాతయాత్ర కాదు అజీర్తి యాత్ర

మెట్‌పల్లి టౌన్: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాదయాత్ర రైతులు కోసం కాదని కల్వకుంట్ల కుటుంబం ప్రజాధనాన్ని కొల్లగొట్టి తిన్నది అరగక చేసే అజీర్తి యాత్ర అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణా రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన చక్కెర ఫ్యాక్టరీని మూసి వేసింది కల్వకుంట్ల కుటుంబమేనని అన్నారు. 100 రోజుల్లో చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పి మాటా తప్పినందుకు పాదయాత్ర చేస్తున్నావా అని సంజయ్‌ని నిలదీశారు. సంజయ్ పాదయాత్ర చేయాలం టే మీ కల్వకుంట్ల కుటుంబం అక్రమాల మీద, మీ కుటుంబం అక్రమ సంపాదన మీద ప్రజలకు క్షమాపణ చెప్పి చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగారావు

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ కొడిమ్యాల మండల పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్ ప్రజలను కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో మంత్రులు ప్రసంగించే కార్యక్రమానికి పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సారంగాపూర్ : మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన ఈరుపాటి అనిల్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన బాస మహేష్ అనే వ్యక్తి బీరు సీసాతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో కేసు నమోదు కాగ సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు.

కథలాపూర్ : మండలంలోని సిరికొండకు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ ఎన్‌పీడీసీఎస్ సీఎండీ క్రాంతి వరణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రు. 2.25 కోట్ల నిధులతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

మల్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలం అయిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సత్యం విమర్శించారు. మల్యాలలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుం డగా ఈ నెల 14 నుంచి విజయోత్సవాలను నిర్వహించాలని అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆయన వెంట గాజుల మల్లేశం, గౌతంరాజ్, సాయికుమార్ ఉన్నారు

మెట్‌పల్లి టౌన్: ఈ నెల 11న ఆంధ్రజ్యోతి జిల్లా పేజిలో మెట్‌పల్లి బల్దియాలో పారిశుధ్యం అస్తవ్యస్తం అనే కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. పట్టణంలోని నిఖిల్ భరత్ స్కూల్ వెనుకల నిలిచిన మురికి నీటి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో కచ్చ డ్రేనేజీని తవ్వి మురికి నీటిని తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది ముజీబ్ తెలిపారు. మురికి నీటిని తొలగించడంతో కాలనీ వాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతాలు తెలిపారు.

మెట్‌పల్లి రూరల్ : రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ వీపీ లక్ష్మ ణ్‌కుమార్‌లు అన్నారు. సోమవారం మండలంలోని మాజీ జడ్పీటీసీ కాటిపల్లి రాధ-శ్రీనివాస్‌రెడ్డిల నూతన రైస్‌మిల్‌ను ప్రారంభించారు. వారిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

రాయికల్: అబద్ధపు హామీలతో రైతులను మోసం చేసి గద్దెనెక్కి, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతు లకు బాసటగా నిలవడానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు పాదయా త్రను విజయవంతం చేయాలని జడ్పీ మాజీ ఛైర్మన్ దావ వసంతసురేష్ అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపడుతున్న ఈ పాదయాత్రకు హరీష్ రావు వస్తున్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ, మండల అధ్యక్షులు, నాయకులు, పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ చేపట్టిన రైతు పాదయాత్రకు పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు తరలిరావాలని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి పిలు పునిచ్చారు. సోమవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత అన్నదాతలనుదగా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ పాదయాత్రకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

జగిత్యాల అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత జాతీయ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో, తీన్‌ఖని చౌరస్తా వద్ద, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రి అయిన అబుల్ కలాం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అ న్నారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల ప్రొఫెసర్లు రాజు, డాక్టర్ సాయి మధుకర్, గోవర్ధన్, గ్రంథాలయాధికారి శ్రీనివాస్, బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో జాతీయ విద్యా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, పలువురు నేతలు భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ముస్లిం కమిటీ మాజీ అధ్యక్షులు ఎండీ జహంగీర్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఆసిఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు ఎండీ షబ్బీర్, ఏఎంసీ పాలక వర్గ సభ్యులు ఎండీ రఫియొద్దీన్, ఎండీ ఇక్రం, ఇష్తికర్, షహబాజ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సి పాల్ వేణు, అధ్యాపకులతో కలిసి అబ్దుల్ కలాం చిత్రప టానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుపతి, అధ్యాపకులు జయపాల్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, జయశీల, అనిల్ కుమార్, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, దీక్షిత, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుక లను ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళు లు అర్పించారు. పాఠశాల డైరెక్టర్‌లు లలిత విద్యాస్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, షారు, సంజన, శృతి, రజిత, ఇందుజ, స్రవంతి, మనీషా, మమత, ఉన్నారు.